సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.21,600

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.21,600, కనిష్టంగా రూ.2,500 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
37.5°/12.7°

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



ఉప కారాగార గదులను పరిశీలిస్తున్న జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

హిందూపురం అర్బన్: సబ్‌జైలులోని ఖైదీల ఆరోగ్యంపై జైలు అధికారులు శ్రద్ధ చూపాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించినా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. ఖైదీలు ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యాధికారులతో చికిత్సలు చేయించాలన్నారు. మంగళవారం ఆయన స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. సబ్ జైలులో ప్రస్తుతం ఖైదీలు ఎంత మంది ఉన్నారు? ఏయే నేరాల్లో జైలుకు వచ్చారు? వారి న్యాయ సాయం కోసం న్యాయవాదులు ఉన్నారా.. తదితర విషయాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ప్రభుత్వ పరంగా ఉచిత న్యాయ సాయం అందిస్తామన్నారు. అలాంటి ఖైదీలు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జైలులో ఎవరైనా కుల వివక్ష ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే 18 ఏళ్లు దాటని, 80 ఏళ్లు పైబడిన ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీర్ఘ కాలిక రోగాలున్న ఖైదీలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం జైలు గదులు, వంట గది, శుద్ధజలం, న్యాయ సహాయ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది నవేరా, పారా లీగల్ వలంటీర్ సురేష్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.

‘జ్ఞానజ్యోతి’తో బోధన మెరుగు పర్చుకోవాలి


- అంగన్‌వాడీలకు డీఈఓ కృష్ణప్ప సూచన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

పుట్టపర్తి టౌన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఇస్తున్న ‘జ్ఞాన జ్యోతి’ శిక్షణ ద్వారా బోధన సామర్థ్యాలు మెరుగుపర్చుకోవాలని డీఈఓ కృష్ణప్ప అంగన్‌వాడీలకు సూచించారు. మంగళవారం కొత్తచెరువులో ఎంపీపీ పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లకు ‘జ్ఞానజ్యోతి’ పేరుతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి కిట్లు కూడా అందజేసినట్లు వెల్లడించారు. శిక్షణ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీల బోధన సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు. శిక్షణ సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జయచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్, రిసోర్స్ పర్సన్లు సాయిశివ, బిందుమాధవి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వరప్రసాద్, ఓబులేసు పాల్గొన్నారు.

నదులు జాతీయ సొత్తు. ప్రకృతి ప్రసాదించిన వరం. కానీ రెవెన్యూలోని కొందరు అధికారులు వాటిని కొందరికి ధారాదత్తం చేశారు. పైసల కోసం ప్రజాప్రయోజనాలను తాకట్టు పెట్టారు. ఒక్క సంతకంతో చిత్రావతి నదికి యాజమాన్య హక్కులు కల్పించారు. ఎంజాయ్‌మెంట్ పేరుతో 43 ఎకరాలు రాసిచ్చేశారు. ఇలా ఎంజాయ్‌మెంట్ హక్కులు పొందిన బడా రియల్టర్ చిత్రావతిపై అక్రమంగా బ్రిడ్జి కట్టి నదీ జలాలకు అడ్డుకట్ట వేశాడు. కింద భాగంలో పొలాలున్న రైతులనూ అష్టకష్టాలు పెడుతున్నాడు. నదికే యాజమాన్య హక్కులు పొందిన రియల్టర్ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.



చిత్రావతిని రాసిచ్చేశారు!

నదులపై రెవెన్యూ పెత్తనం

- రియల్టర్‌కు నదిని ధారాదత్తం చేసిన తహసీల్దార్
- 2019లోనే నదీ పోరంబోకు 43 ఎకరాలకు ఎంజాయ్‌మెంట్
- నదిపై ఏకంగా బ్రిడ్జి కట్టించుకున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టి
- అక్రమ నిర్మాణమని నోటీసులిచ్చిన ఇరిగేషన్ అధికారులు
- బదులుగా గతంలో పొందిన ఎంజాయ్ మెంట్ కాపీని పంపిన వైనం

చిలమత్తూరు: జిల్లాలోని ప్రధాన నదుల్లో ‘చిత్రావతి’ ఒకటి. వేలాది ఎకరాలకు సాగునీరు, అనేక ప్రాంతాలకు తాగునీరు అందించే ఈ నదిని చిలమత్తూరు మండలంలో రెడ్డెప్ప శెట్టి అనే వ్యక్తి ఆక్రమించాడు. ఏకంగా బ్రిడ్జి నిర్మించి నీటి వనరులను సొంతానికి వినియోగించుకుంటున్నాడు. ఇది అక్రమమని ఇరిగేషన్ అధికారులు తేల్చగా...గతంలో తాను పొందిన ‘ఎంజాయ్‌మెంట్’ పత్రం చూపుతున్నాడు.

రాజేంద్రసింగ్ హయాంలో...

2019 ఎన్నికల సమయంలో చిలమత్తూరు తహసీల్దార్‌గా రాజేంద్రసింగ్ పనిచేశారు. ఆ సమయంలో జిల్లా యంత్రాంగం అంతా ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉండగా.. రాజేంద్ర సింగ్ మాత్రం కాసుల కోసం ప్రభుత్వ భూములను ఎడాపెడా పరాధీనం చేశారు. ఈ క్రమంలోనే రియల్టర్ రెడ్డెప్పశెట్టికి జూన్ 18 తేదీన కోడూరు పొలంలో సర్వే నంబరు 661, 680–1,2లలో 43 ఎకరాల నదిని ధారాదత్తం చేశారు. ఆ ఎంజాయ్‌మెంట్ పత్రంతోనే రెడ్డెప్పశెట్టి చిత్రావతి నదిని చెరబట్టి అందరినీ ఇబ్బంది పెడుతున్నారు.



నదికి ఎంజాయ్‌మెంట్ పట్టా పొందినట్టు 2023లో అధికారులకు సమర్పించిన డాక్యుమెంట్

అధికారులు నోటీసులిచ్చినా...

రియల్టర్ రెడ్డెప్పశెట్టి చిత్రావతికి అడ్డంగా బ్రిడ్జి కట్టి నీటి వనరులు కిందకు వెళ్లకుండా వాడుకుంటుండంతో పాటు నది పోరంబోకు భూములను సైతం తన ఆధీనంలోనే ఉంచుకున్నాడు. నదికి ఆవలవైపు భూములున్న రైతులను అడ్డుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై ‘సాక్షి’ కథనం ప్రచురించగా... రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సోమవారం అక్రమ బ్రిడ్జిని పరిశీలించారు. రియల్టర్‌కు నోటీసులు జారీ చేశారు. కానీ రియల్టర్ రెడ్డెప్పశెట్టి 2019లో అప్పటి తహసీల్దార్ రాజేంద్రసింగ్ తనకు మంజూరు చేసిన ఎంజాయ్‌మెంట్ పత్రాన్ని చూపుతూ రుబాబు చేస్తున్నాడు. ఇదే పత్రాన్ని తాను 2023లోనే అధికారులకు ఇచ్చానని చెప్పడం గమనార్హం. అయినా ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రియల్టర్‌కు ప్రభుత్వ భూములా..?

పోరంబోకు స్థలాలను సాధారణంగా పేదలకు లీజుకు ఇస్తుంటారు. పంటల సాగు, మొక్కల పెంపకం వంటి వాటికి అనుమతి మంజూరు చేస్తారు. అయితే వందల ఎకరాలు కలిగిన రియల్టర్ రెడ్డెప్ప శెట్టికి సుమారు 43 ఎకరాల నదికి ఎంజాయ్‌మెంట్ పత్రాలు మంజూరు చేయడం కలకలం రేపుతోంది. ఇదే విషయాన్ని సదరు రియల్టర్ అధికారులు అడిగిన ప్రశ్నలకు వివరణలో పేర్కొనడం విశేషం. ఏ నిబంధన మేరకు నదికి ఎంజాయ్‌మెంట్ అనుమతులు ఇచ్చారన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.

ఎంజాయ్‌మెంట్ చెల్లదు

చిత్రావతి పరీవాహకంలోని పోరంబోకు భూములకు ఎంజాయ్‌మెంట్ ఇవ్వడం చట్ట విరుద్ధం. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే నీటి ప్రవాహానికి దూరంగా ఉండి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉంటేనే ఇచ్చే అవకాశం ఉంటుంది. బ్రిడ్జిని కచ్చితంగా తొలగిస్తాం. అదేవిధంగా పోరంబోకుకు ఇచ్చిన ఎంజాయ్‌మెంట్ రద్దు చేయాలని నోటీసులు అందించాం. ఇందుకు వారం రోజులు గడువిచ్చాం. మాట వినకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– యోగానంద, ఇరిగేషన్ డీఈ, హిందూపురం

రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

తనకున్న వందల ఎకరాల భూములకు కంచె వేసుకున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టి... ఇతర రైతుల పొలాలకు వెళ్లేందుకు ఎప్పటి నుంచో ఉన్న దారిని సైతం మూసివేశారు. దీంతో ఇటీవలే కొడికొండకు చెందిన ఓ వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎవ్వరూ ఎలాంటి చర్యలకు ఉపక్రమించలేదు.

ప్రభుత్వ భూములూ ఆక్రమణ..?

రియల్టర్ రెడ్డెప్పశెట్టి ప్రభుత్వ భూములనూ తన ఆధీనంలో ఉంచుకున్నట్టు ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములను కొనడంతో పాటు సమీపంలోని ప్రభుత్వ భూములన్నీ ఆధీనంలో ఉంచుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు పూర్తిస్థాయిలో విచారిస్తే అసలు విషయాలు నిగ్గు తేలుతాయని ప్రజలు చెబుతున్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు మార్కెట్‌లో నిలకడగా ఉన్నాయి. మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 113.50 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో మొదటిరకం ఎండుమిర్చి క్వింటా రూ.15 వేలు, రెండో రకం రూ.13,500, మూడో రకం క్వింటా ఎండు మిర్చి రూ.8 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలిపారు.

శ్రీవారి పాదాలను తాకిన సూర్య కిరణాలు



మూలవిరాట్‌ను తాకుతున్న సూర్యకిరణాలు

హిందూపురం అర్బన్: స్థానిక పేట వేంకటరమణ స్వామి మూలవిరాట్ పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఏటా వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే తొలి మంగళవారం ఉదయం 7 గంటలకు ఈ అరుదైన ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. దీంతో తెల్లవారుజామునే ఆలయానికి భక్తులు పోటెత్తారు. మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకిన అనంతరం అర్చకులు విశేష పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

‘అసంఘటిత’ కార్మికులను నమోదు చేయాలి

- ‘ఈ–శ్రమ్’లో వివరాల నమోదుతో ఎన్నో ప్రయోజనాలు
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ‘ఈ–శ్రమ్’ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల నమోదు ప్రక్రియ జిల్లాలో వంద శాతం పూర్తి కావాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ, జిల్లా సమన్వయ కమిటీ, జిల్లా స్థాయి అమలు కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రెండు లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు ‘ఈ–శ్రమ్’ పోర్టల్‌లో నమోదు కావాల్సి ఉందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పనిచేసే చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు తాపీ మేస్త్రీలు, శానిటరీ వర్కర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇటుక బట్టీలో పనిచేసే కూలీలు, రిక్షా డ్రైవర్‌లు, టైల్స్ పరిశ్రమల్లో పనిచేసే కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, కుమ్మరి, కమ్మరి, స్వర్ణకారులు, తోపుడు బండ్లు, వీధి వ్యాపారస్తులను గుర్తించాలన్నారు. ‘ఉపాధి’ కూలీలు, చేనేత కార్మికులు, అంగన్‌వాడీ కార్మికుల వివరాలనూ ‘ఈ–శ్రమ్’ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. నమోదైన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక యూనివర్సల్ గుర్తింపు కార్డు జారీ చేస్తారని, ఈ కార్డు ఉంటే ప్రభుత్వ సామాజిక భద్రత, సంక్షేమ పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. ‘ఈ–శ్రమ్’ పోర్టల్‌లో నమోదైన ప్రతి కార్మికుడికీ ఏడాది పాటు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ప్రయోజనాలు దక్కుతాయన్నారు. దీని గురించి విస్తృత ప్రచారం చేసి కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లేబర్ అధికారి సూర్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

పుట్టపర్తి అర్బన్: జాతీయ రహదారి 342 నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి పుట్టపర్తి నుంచి గోరంట్ల మండలం, చిలమత్తూరు మండలం కోడూరు వరకూ జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఏడాదిగా పనులు సాగుతున్నాయని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తద్వారా ఈ మార్గంగుండా రవాణ మెరుగవుతుందన్నారు. అలాగే ఇప్పటికే పూర్తయిన వెంగటగారిపల్లి వద్ద ఉన్న ఘాట్ పనులను పరిశీలించారు. ఇంకా ఎక్కడైనా భూ సేకరణ పూర్తి కాకపోయినా, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందకపోయినా.. తన దృష్టికి తీసుకురావాలన్నారు. భూముల్లో ఉన్న మట్టి కుప్పలు, రాళ్లు, తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్–342 ఈఈ గిడ్డయ్య, సంబంధిత కంట్రాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ అండతోనే నాపై దాడి

- సమావేశంలో గుంతకల్లు ప్రభాకర్

పెనుకొండ రూరల్: రాజకీయ అండదండలతోనే బీజేపీకి చెందిన ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని గుంతకల్లు ప్రభాకర్ అన్నారు. ‘కియా’ పరిశ్రమ సమీపంలోని ఓ భూవివాదానికి సంబంధించి, ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అనుచరుడైన గుంతకల్లు ప్రభాకర్‌పై ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ అనుచరులు దాడికి దిగిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో మంగళవారం గుట్టూరులో బాధితుడు గుంతకల్లు ప్రభాకర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మునిమడుగు పొలం సర్వే నంబర్ 433లో 1.12 ఎకరాలు, గుట్టూరు పొలం 324లో 61 సెంట్లు మేర తనకు పొలం ఉందన్నారు. తన భూమిలో పనులు చేసుకుంటుంటే రౌడీలను పంపి దాడి చేయడం సరికాదన్నారు. వాటిని కప్పిపుచ్చు కునేందుకు ఎక్కడో ప్రెస్‌మీట్‌లు పెట్టి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

చర్చకు సిద్ధమా ఆదీ..?

‘‘నువ్వు నిజంగా నిజాయితీ పరుడవైతే..న్యాయమైన చర్చకు సిద్ధమా ఆదీ’’ అని గుంతకల్లు ప్రభాకర్ సవాల్ విసిరారు. ‘‘హైదరాబాద్‌కు చెందిన ఓ.. ప్రముఖ వ్యాపారవేత్తను నువ్వు కిడ్నాప్ చేసింది నిజం కాదా...ఈ కేసులో నిన్ను పోలీసులు అరెస్టు చేసింది నిజం కాదా’’ అని ప్రశ్నించారు. ఆదినారాయణపై అక్రమాలు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లు, ఫోర్జరీ కేసులు పది వరకు ఉన్నాయన్నారు. అతని లాగా తాను పార్టీలు మార్చేరకం కాదన్నారు. గ్లోబల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు సంబంధించి 250 ఎకరాల భూమిపై కోర్టు కేసు నడుస్తున్న మాట వాస్తవమేనని, అందులోని 88 ఎకరాలకు తన భాగస్తుడికి కోర్టు స్టే ఇచ్చిందన్నారు. ఆ భూములకు, దాడికి కారణమైన తన భూమికి ఎలాంటి సంబంధమూ లేదన్నారు. తాము నిజాయితీ పరులమని, కాబట్టే తాము మోసపోయామన్నారు. మరోసారి తప్పుడు ఆరోపణలు చేస్తే ఖబడ్దార్ అని ఆదినారాయణను ఈ సందర్భంగా ప్రభాకర్ హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభాకర్

‘సైబీరియన్’ స్నేహితులొచ్చారు!





వీరాపురంలో చెట్లపై సైబీరియన్ కొంగలు

చిలమత్తూరు: సైబీరియన్ స్నేహితులొచ్చారు. మండలంలోని వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో సందడి చేస్తున్నారు. సంతానోత్పత్తి కోసం ఏటా మార్చిలో వీరాపురానికి వచ్చే సైబీరియన్ పక్షులు...ఈసారి కాస్త ముందుగానే వచ్చేశాయి. గత ఏడాది డిసెంబరు, ఈ ఏడాది జనవరిలోనే వచ్చిన పక్షుల గుంపు... ఇక్కడి వాతావరణ పరిస్థితులను చేసుకుని వెళ్లింది. సంతానోత్పత్తికి అనుకూలంగా ఉండటంతో వందలాది పక్షులు వేల కి.మీ దూరం ఎగురుతూ వచ్చి వీరాపురం, వెంకటాపురం చేరుకున్నాయి. చెట్లపై ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న ఈ ఎర్రకాళ్ల కొంగలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. ఆరు నెలల పాటు ఇక్కడే ఉండి సంతానోత్పత్తి చేసుకొని తిరిగి మళ్లీ సైబీరియన్ వెళ్లిపోతాయి.

సాయీశ్వరా.. మముబ్రోవరా



సాయీశ్వర లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న విదేశీయులు



అతిరుద్ర మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంతి నిలయం: సాయీశ్వర నామంతో ప్రశాంతి నిలయం మార్మోగింది. సత్యసాయి.. ఈశ్వరుడి ప్రతిరూపమంటూ కీర్తించారు. సాయీశ్వరా...మముబ్రోవరా అంటూ వేడుకున్నారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రశాంతి నిలయంలో చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞంలో భాగంగా నార్త్ బిల్డింగ్స్ మైదానంలో చేపట్టిన అష్టోత్తర శత సహస్ర సాయీశ్వర లింగార్చన ఘట్టం మంగళవారం ముగిసింది. చివరి రోజు లింగార్చనలో పాల్గొన్న భక్తులు ప్రత్యేకంగా రూపొందించిన సాయీశ్వర లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు దంపతులు సాయీశ్వరునికి పూజలు నిర్వహించారు. ఇక అతిరుద్ర మహాయజ్ఞం 6వ రోజు మంగళవారమూ కొనసాగింది. వేదపండితులు వేదమంత్రోచ్చారణ మధ్య యజ్ఞ క్రతువు నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ హిందూస్థానీ సంగీత విద్వాంసుడు సంబుద్ధా ఛటర్జీ బృందం సంగీత కచేరీ భక్తులను ఆకట్టుకుంది. జ్యోతిష్య శాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ ఎస్.మురళీ భక్తులనుద్దేశించి ప్రసంగించారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సంబుద్ధా ఛటర్జీ బృందం



సాయీశ్వర లింగానికి పూజలు నిర్వహిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు దంపతులు

క్లుప్తంగా

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్



ధర్మవరం సబ్‌జైలులో బియ్యాన్ని పరిశీలిస్తున్న జడ్జి శివప్రసాద్‌యాదవ్

ధర్మవరం అర్బన్/పెనుకొండ: సత్ప్రవర్తన అలవర్చుకుంటే మెరుగైన జీవితం ఉంటుందని సబ్‌జైల్‌లోని ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్‌యాదవ్ సూచించారు. ధర్మవరం, పెనుకొండలోని సబ్‌జైళ్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూం, బ్యారక్‌లు, రికార్డులు పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఖైదీలతో సమావేశమై మాట్లాడారు. కోర్టు కేసుల్లో వాదించేందుకు న్యాయవాది లేకపోతే లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలసుందరి, బిల్లే రవి, పారా లీగల్ వలంటీర్ షామీర్‌బాషా, విశ్రాంత న్యాయవాది అశ్వత్థనారాయణ, ఉప్పర నరసప్ప, ఆయా జైళ్ల అధికారులు పాల్గొన్నారు.

యూట్యూబ్ చానల్ నిర్వాహకుడి మృతదేహం లభ్యం



తిరుమలరెడ్డి మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కనిపించకుండా పోయిన యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు 24 గంటలు గడవక ముందే హంద్రీనీవా కాలువలో మృతదేహమై తేలాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లుకు చెందిన యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు తిరుమలరెడ్డి (45) గత ఆదివారం బుగ్గ సంగాల క్షేత్రం సమీపంలో అదృశ్యమైన విషయం తెలిసిందే. కాగా, ఆయన మృతదేహం గుంతకల్లు–మద్దికెర మార్గంలోని హంద్రీ–నీవా ప్రధాన కాలువలో సోమవారం కొట్టుకువచ్చింది. తల, ముఖం, కాళ్లపై ఉన్న గాయాలను బట్టి తిరుమలరెడ్డి హత్యకు గురైనట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, తిరుమలరెడ్డి అదృశ్యమైన ప్రాంతంలో దెబ్బతిన్న ఆయన బైక్ తప్ప ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. హతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, వ్యక్తుల పేర్లను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఓ అనుమానితుడిని ఇప్పటికే తమ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

గాడి తప్పిన పాలన...
ఆస్తులకు దక్కని రక్షణ



- టీడీపీ నేతల కనుసన్నల్లో ఆలయం
- కనుమ లక్ష్మీనారసింహస్వామి ఆదాయం రూ.లక్షల్లో ఉన్నా పట్టించుకోని దేవదాయ శాఖ
- ప్రశ్నార్థకంగా 183 ఎకరాల మాన్యం భూమి

చిలమత్తూరు: జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆస్తులకు రక్షణ కరువైంది. పాలక మండలి సభ్యులందరూ స్థానికులే కావడం, టీడీపీ నేతల కనుసన్నల్లోనే అన్ని వ్యవహారాలు కొనసాగించాల్సి రావడంతో విసుగు చెందిన దేవదాయ శాఖ అధికారులు ఆలయ నిర్వహణను గాలికి వదిలేశారు. ఫలితంగా 183 ఎకరాల దేవుడి మాన్యం పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలోనే రూ. కోట్లు విలువ చేసే మాన్యం భూములను కబ్జా చేసే ప్రయత్నాలు కూడా ఊపందుకున్నాయని, దేవుడి స్థిరాన్ని అన్యాక్రాంతం కావడం ఖాయమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు పక్కదారి

చిలమత్తూరు సమీపంలోని కనుమలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆదాయం రూ. లక్షల్లోనే ఉంటోంది. హుండీ, విరాళాల రూపంలో ఏటా రూ.15 లక్షలకు పైబడే ఆదాయం ఉంటోందని భక్తులు అంటున్నారు. దీనికి స్వామి వారి భూముల్లో పంటలు సాగుచేస్తున్న రైతులు చెల్లిస్తున్న కౌలు అదనంగా ఉంటోంది. అయితే ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చించడంలో దేవదాయ శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. దీంతో ఆలయ పాలక మండలి సభ్యులు అక్రమాలకు తెరలేపినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. రూ. కోట్లలో స్థిరాస్తులున్నా ఆలయ అభివృద్ధి, నిర్వహణను గాలికి వదిలేసి, నిత్య పూజలు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే ఆలయానికి ఆదాయమే లేదు, సొంత డబ్బు పెట్టుకుని పూజలు సజావుగా జరిగేలా చూస్తున్నామని ఆలయ పాలక మండలి సభ్యులు పేర్కొనడం గమనార్హం.



ఎలాంటి పరిహారం చెల్లించకుండానే మాన్యం భూమిలో నిర్మించిన జాతీయ రహదారి

అన్యాక్రాంతమైన స్థిరాస్తులు

కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి చిలమత్తూరులోని భూముల్లో ఇప్పటి వరకూ చాలా భాగం అన్యాక్రాంతమైంది. మరి కొంత స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. దేమకేతేపల్లి సమీపంలో 183 ఎకరాల పైచిలుకు భూములున్నాయి. ఇందులోనే 544ఈ జాతీయ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం 2.50 ఎకరాలు స్వాధీనం చేసుకుంది. ఇందుకు సంబంధించిన రూ.50 లక్షల పరిహారాన్ని ఇప్పటి వరకూ ప్రభుత్వం చెల్లించలేదు. దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఇది పరాకాష్టగా స్థానిక భక్తులు పేర్కొంటున్నారు. ఆలయానికి సంబంధించి ఇప్పటి వరకూ అధికారికంగా అభివృద్ధి కమిటీని సైతం దేవదాయ శాఖ అధికారులు నియమించలేదు. దీంతో ఆలయ పాలక మండలి సభ్యులుగా స్థానిక టీడీపీ నేతలు అనధికారికంగా కొనసాగుతూ ఆలయ అభివృద్ధిని గాలికి వదిలేశారనే పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని దేవదాయ శాఖ

కనుమ లక్ష్మీనారసింహస్వామి ఆలయం దేవదాయ శాఖ పరిదిలో ఉన్నా ఏనాడూ ఆలయ అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆలయ ఆదాయం, ఉత్సవాల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణను గాలికి వదిలేసినట్లుగా కనిపిస్తోంది. రూ. కోట్లు విలువ చేసే మాన్యం ఉన్నా ఈ ఆలయానికి ఈఓ లేకపోవడం, ఆలయ ఆదాయంపై కనీసం దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం ఉన్న లోకల్ పాలకమండలి ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే స్వామికి చెందిన 183 ఎకరాల మాన్యం భూములకు రక్షణ కరువైంది. ఈ భూములను చాలా మంది రైతులు కౌలుకు చేస్తున్నారు. వారిచ్చే ధాన్యం, లేక నగదుపై లెక్కలేమీ ఉండడం లేదు. హుండీ, విరాళాలు వీటన్నింటికీ అధికారిక లెక్కలేవీ చూపడం లేదు. వచ్చే ఆదాయమంతా ఏమవుతుందో ఒక్క నరసింహస్వామికి , లోకల్ పాలక మండలి సభ్యులకు తప్ప మూడో కంటికి తెలియడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

అంతా వాళ్లు చెప్పినట్లే వినాలి

చిలమత్తూరు మండలంలోని కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయం పేరుకు మాత్రమే దేవదాయ శాఖ పరిధిలో ఉంది. ఆలయ పాలక మండలి కమిటీ లేదు. ఇప్పటి వరకూ స్థానికులే ఆలయ బాధ్యతలు చూసుకుంటున్నారు. ఉత్సవాలు కూడా వారే నిర్వహిస్తుంటారు. ఆదాయం, తదితర అంశాలకు సంబంధించిన విషయాలేవీ మాకు తెలియవు... వారు తెలపరు కూడా. అంతా వాళ్లు చెప్పినట్లు వినాలి. ఆలయ స్థిరాస్తుల పరిరక్షణ మాత్రమే మా బాధ్యత.

– నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి, దేవదాయశాఖ

నేడు లంకా దినకర్ రాక

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈ నెల 19న జిల్లాకు రానున్నారు. ఈ మేరకు కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ జిల్లా కడప నుంచి బయలుదేరిన ఆయన రోడ్డు మార్గాన మంగళవారం రాత్రి 8 గంటలకు పుట్టపర్తిలోని శాంతి భవన్‌కు చేరుకుని, రాత్రికి అక్కడే బస చేస్తారు. జిల్లాలో 20 సూత్రాల అమలుపై బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకూ కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు.

చెలరేగిన 'కేబుల్' దొంగలు

యాడికి: మండలంలోని చందన గ్రామంలో కేబుల్ దొంగలు చెలరేగారు. తొమ్మిది మంది రైతులు బోరు బావులకు అనుసంధానం చేసిన విద్యుత్ కేబుల్‌ను సోమవారం రాత్రి కత్తిరించి ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పంట పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు విషయాన్ని గుర్తించి లబోదిబో మన్నారు. ప్రతి బోరు బావి వద్ద స్టార్టర్ పెట్టెలోని ఫీజులు తొలగించి, కేబుల్ వైర్లు కత్తిరించి అపహరించడం గమనార్హం. ఘటనతో ప్రతి రైతు రూ. వెయి, నుంచి రూ. 2వేల వరకూ నష్టం వాటిల్లింది. ఘటనపై పోలీసులకు బాధిత రైతులు ఓంకారయ్య, మధు, రామకృష్ణ, నాగేంద్ర, నాగయ్య, ఆదిరంగారెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగులతో బంతాట

- ఎప్పుడు పడితే అప్పుడు బదిలీలు
- ఆరుమాసాల్లో ఐదుగురు ఎస్పీలను మార్చిన వైనం
- అనంతపురం కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యంగా కమిషనర్ల మార్పు
- తాజాగా విద్యుత్ శాఖ ఎస్ఈ బదిలీ
- అటకెక్కిన పాలన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పుణ్యమా అని జిల్లా అధికార యంత్రాంగంలో తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఉన్నతాధికారులు సైతం ఉద్యోగం చేయాలంటే భయపడుతున్నారు. ఎప్పటివరకూ ఉంటామో.. ఎప్పుడు బదిలీ చేస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు. శాఖల హెచ్ఓడీలకే దిక్కులేకుండా పోయిన పరిస్థితి. రాజకీయ జోక్యంతో రాత్రికి రాత్రే బదిలీలు జరుగుతుండటంతో పనిచేయాలంటేనే మనసొప్పడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు అండగా ఉంటామని చెప్పి ఓట్లు వేయించుకున్న నాయకులు ఇప్పుడు తమ పనులు చేయకుంటే మెడపై కత్తి పెట్టి మరీ బదిలీ చేయిస్తున్న దుస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా కలెక్టర్ పూర్తిగా నిశ్చేష్టులై చూస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్ఈ బదిలీతో అలజడి..

కూటమి సర్కారు వచ్చేనాటికి ఉమ్మడి అనంతపురం జిల్లాకు విద్యుత్ శాఖ ఎస్ఈగా సురేంద్ర ఉండేవారు. ఈయనపై రాజకీయ ముద్రవేసి అనంతపురం జిల్లా ఎస్ఈగా తెచ్చారు. మడకశిర ఎమ్మెల్యే రాజు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు సంతకాలు చేసి మరీ ఆయన్ను తీసుకొచ్చారు. అయితే, మాదిగ సామాజిక వర్గానికి చెందిన సంపత్‌కుమార్ నాలుగు నెలలు పని చేశారో లేదో ఉన్నఫళంగా రెండు రోజుల క్రితం బదిలీ అయ్యారు. దీంతో ఒక్కసారిగా విద్యుత్‌శాఖలో అలజడి మొదలైంది.



ఐదుగురు ఎస్పీలు..

కూటమి సర్కారు వచ్చాక జిల్లాకు ఐదుగురు ఎస్పీలు వచ్చి వెళ్లారు. ఎస్పీలపై ఇక్కడి నాయకులు పదే పదే అధిష్టానానికి ఫిర్యాదులు చేయడం మొదలు పెట్టారు. ఎన్నికల సమయంలో ఉన్న అన్బురాజన్ కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొన్నాళ్లకే బదిలీ అయ్యారు. ఆ తర్వాత అమిత్ బర్దార్, గౌతమి శాలి, మురళీ కృష్ణలు వచ్చిన రెండు మాసాలకే తిరిగి వెళ్లిపోయారు. ప్రస్తుత ఎస్పీ జగదీష్‌పై కూడా బదిలీ కత్తి వేలాడుతోందని అంటున్నారు.

సంతకం చేయకుంటే ఊడినట్లే..

కూటమి ప్రభుత్వంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మరీ భ్రష్టు పట్టింది. ఇక్కడ ఐదు నెలల్లో ఐదుగురు కమిషనర్లు మారారు. నేతలు చెప్పిన చోట సంతకం చేయకపోతే మరుసటి రోజే బదిలీ కావాల్సి వస్తోంది. మేఘ స్వరూప్ అనంతరం నాగరాజు, రామలింగేశ్వర్, మల్లికార్జునరెడ్డిలు బదిలీ అయ్యారు. తాజాగా బాలస్వామి వచ్చారు. ఈయన ఎన్నాళ్లుంటారో తెలియని పరిస్థితి. దీంతో కార్పొరేషన్‌లో పాలన స్తంభించి పోయింది.

రెండు నెలలు తిరక్కముందే ఏఎస్పీపై..

శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుకొండ డీఎస్పీగా ఉన్న ఆర్ల శ్రీనివాసులుకు ఇటీవల అడిషనల్ ఎస్పీగా పదోన్నతి వచ్చింది.అదే జిల్లాకు ఏఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ప్రశాంతంగా పనిచేస్తున్న సమయంలో ఉన్నఫళంగా ఆయనకు బదిలీ ఆర్డర్స్ వచ్చాయి. ఆ జిల్లా ఎస్పీకి నచ్చలేదని అడిషనల్ ఎస్పీని బదిలీ చేయించారనే విమర్శలొస్తున్నాయి. దీంతో శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

మహిళల భద్రతకు భరోసానివ్వాలి

- జిల్లా స్థాయి మహిళా సదస్సులో ఎస్పీ రత్న



సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: మహిళల భద్రతకు భరోసానివ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్పీ రత్న అన్నారు. 'మహిళల భద్రత – భవిష్యత్తుకు భరోసా' పేరుతో మంగళవారం పెడపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ రత్న హాజరై మాట్లాడారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, బాల్య వివాహాలు, సైబర్ క్రైం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మొబైల్‌ను మంచికి వినియోగించాలని సూచించారు. రోజూ ఓ నియోజకవర్గం చొప్పున మార్చి 15వ తేదీ వరకూ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాటికి నేర రహిత జిల్లాగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల చేకూరే అనర్థాలపై చైతన్యపరిచారు. సైబర్ క్రైం, హనీ ట్రాప్ వలలో పడరాదన్నారు. అనంతరం ఉమెన్ ప్రొటెక్షన్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే సింధూరరెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాల నియంత్రణపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్డీఓ సువర్ణ, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం , ఐసీడీఎస్ పీడీ సుధావరలక్ష్మి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, పెడపల్లి సర్పంచ్ మంగ్లీబాయి, పెద్ద ఎత్తున మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికోటి ప్రవీణ్ వివాదాస్పద వ్యాఖ్యలు



మాట్లాడుతున్న చికోటి ప్రవీణ్

గుంతకల్లు టౌన్: ధర్మరక్ష వ్యవస్థాపకుడు, తెలంగాణ బీజేపీ నేత చికోటి ప్రవీణ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం గుంతకల్లు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభనుద్దేశించి చికోటి ప్రవీణ్ మాట్లాడుతూ.. మత ప్రబోధకుల్లో 90 శాతం మంది సరిగా లేరంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ నినదిస్తే హైదరాబాద్‌లోని ఒవైసీతో పాటు ఇతరులకు వణుకు పుట్టాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ప్రతిచోటా హిందుత్వానికి శత్రువులు ఎక్కువయ్యారని, సెక్యులర్ వాదులను తాను శిఖండీలుగా అభివర్ణిస్తున్నానని అన్నారు.

కంది పంట దగ్ధం



మంటలు ఆర్పేందుకు శ్రమిస్తున్న రైతులు

గోరంట్ల: ఆకతాయిలు నిప్పు రాజేయడంతో పది ఎకరాల్లో రైతులు సాగు చేసిన కంది పంట దగ్ధమైంది. గోరంట్ల మండలం వానవోలు తండా సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తండాకు చెందిన కుంటి సోమ్లునాయక్, తిప్పేనాయక్, రామచంద్రనాయక్ తమకున్న 10 ఎకరాల్లో కంది సాగు చేశారు. పంట చేతికి రావడంతో కొంత మేర కోతలు జరిగి, నూర్పిడి కోసం కుప్ప పోశారు. ఈ క్రమంలో కంది కట్టె కుప్పలకు సమీపంలోని బయలు భూమిలో మంగళవారం మధ్యాహ్నం ఆకతాయిలు నిప్పు రాజేశారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడుతూ పంటను చుట్టుముట్టింది. నూర్పిడి కోసం సిద్ధంగా ఉంచిన కంది కట్టెతో పాటు పది ఎకరాల్లోని పంట పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో రూ. లక్షల్లో నష్టపోయినట్లు బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల బలప్రదర్శన మంగళవారం ముగిసాయి. ఆరు పళ్లు, న్యూ కేటగిరి, సీనియర్ విభాగాల్లో జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, నంద్యాల, అన్నమయ్య జిల్లాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. సీనియర్ విభాగం పోటీల్లో నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన రైతు కుందూరు రాంభూపాల్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానం, వైఎస్సార్‌జిల్లా కల్లూరుకు చెందిన రైతు పెరుమాల్ శివకృష్ణ యాదవ్ వృషభాలు రెండవ స్థానం, అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురానికి చెందిన రైతు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి వృషభాలు మూడవ స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ అందజేశారు. అలాగే సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన వృషభాల యజమానికి ఓ పాడి ఆవును రైతులు రమేష్‌రెడ్డి, చిలుకూరు కుమార్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు చిన్నరెడ్డి యాదవ్, రంగస్వామిరెడ్డి యాదవ్, లక్ష్మీరంగయ్య పాల్గొన్నారు.

సరైన చికిత్సతో వంకర పాదాల సమస్య దూరం



చిన్నారికి చికిత్స చేస్తున్న డాక్టర్ బ్రూస్‌స్మిత్

అనంతపురం మెడికల్: సరైన చికిత్సను అందివ్వడం ద్వారా చిన్నారుల్లో వంకర పాదాల సమస్యను నయం చేయవచ్చునని సంబంధిత వైద్య సిబ్బందికి అమెరికాకు చెందిన క్యూర్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ ట్రెనర్ డాక్టర్ బ్రూస్‌స్మిత్ సూచించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్థో విభాగాన్ని పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వంకర పాదాలతో ఇబ్బంది పడుతున్న పలువురు చిన్నారులకు స్వయంగా చికిత్స చేయడంతో పాటు చికిత్స విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2018 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ వంకరపాదాలతో ఇబ్బంది పడిన 78 మంది పిల్లలకు క్యూర్ ఇండియా సంస్థ తరఫున డీబీ స్ప్లిట్‌లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ ఆత్మారాం, వైద్యులు డాక్టర్ సతీష్, రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమాధికారి డాక్టర్ నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి లేపాక్షిలో ఉత్సవాలు



లేపాక్షి ఆలయంలో కొలువైన వీరభద్రస్వామి

లేపాక్షి: ఈ నెల 25 నుంచి లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రమానందన్, ఈఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. 15వ శతాబ్దం నాటి ఆలయం కావడంతో ఇక్కడ నిర్వహించే ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటోంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు లోను కాకుండా చర్యలు తీసుకున్నారు. ఈ నెల 25న మాఘ బహుళ ద్వాదశి నాడు విశేష పూజలతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 26న మహాశివరాత్రి సందర్భంగా భక్తుల జాగారణ కోసం ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కళాకారుల వివిధ సాంస్కృతిక కార్యాక్రమాలు ఉంటాయి. భజనలు, శాస్త్రీయ నృత్యనీరాజనాలు ఉంటాయి. 28న రాత్రి పూల పల్లకీ ఉత్సవం ఉంటుంది.

కాలువలో పడి విద్యార్థి మృతి



జానీ (ఫైల్)

గుమ్మఘట్ట: ప్రమాదవశాత్తు సాగునీటి కాలువలోని నీటి ప్రవాహంలో పడి ఓ విద్యార్థి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... బేలోడుకు చెందిన అన్నపూర్ణకు 11 సంవత్సరాల క్రితం గలగల గ్రామానికి చెందిన లోకేష్‌తో వివాహమైంది. అనారోగ్యంతో 2020లో అన్నపూర్ణ మృతి చెందింది. అప్పటి నుంచి వారి కుమారుడు జాని పోషణను అమ్మమ్మ హనుమక్క, తాత హనుమప్ప తీసుకున్నారు. ప్రస్తుతం జాని (7) బేలోడులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన జాని.. మధ్యాహ్నం తోటి స్నేహితుడు లక్కీతో కలసి గ్రామ సమీపంలోని బీటీపీ సాగునీటి కాలువ వద్దకెళ్లాడు. అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న గాలాన్ని తీసి కాలువలో వేసే క్రమంలో జాని ప్రమాదవశాత్తు అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. ఆ సమయంలో లక్కీ కేకలు విన్న చుట్టుపక్కల పొలాల్లోని రైతులు అక్కడకు చేరుకుని జానీని వెలికి తీశారు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళితే.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోస్టల్ ఉద్యోగిని అదృశ్యం

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లు పోస్టాఫీసులో పనిచేస్తున్న అనూష రెండు రోజులుగా కనిపించడం లేదు. ఈ మేరకు స్థానిక పోలీసులకు ఆమె తల్లి ఈశ్వరమ్మ మంగళవారం ఫిర్యాదు చేశారు. బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన అనూష సోమవారం విధులకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరింది. ఓ దుకాణం వద్ద తనను ఉండమని చెప్పి వెళ్లిన కుమార్తె తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత దుర్మరణం

కణేకల్లు: ద్విచక్ర వాహనంఅదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన సత్యనారాయణ, అనసూయమ్మ (38) దంపతులు. మంగళవారం ఉదయం బొమ్మనహాళ్ మండలంలోని కృష్ణాపురంలో జరిగిన బంధువుల పెళ్లికి తన భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై సత్యనారాయణ వెళ్లాడు. అనంతరం రాయదుర్గం మండలంలోని కదరంపల్లిలో ఉన్న అత్తారింటికి బయలుదేరాడు. సాయంత్రం 6 గంటల సమయంలో కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రి వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అనసూయమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు ఈశ్వర్

కణేకల్లు: మండలంలోని 43 ఉడేగోళం గ్రామానికి చెందిన బోయ ఈశ్వర్ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నిరుపేద కుటుంబానికి చెందిన ఈశ్వర్‌కి రెండేళ్ల క్రితం డి.హిరేహాళ్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన కావేరితో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కూలీ పనులతో కుటుంబాన్ని పోషించుకునే ఈశ్వర్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేయమని భార్య పలుమార్లు ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె కుమారుడిని పిలుచుకుని మంగళవారం సాయంత్రం తన పుట్టింటికెళ్లింది. దీంతో అత్తింటి వారు మందలిస్తారేమోననే అనుమానంతో మంగళవారం రాత్రి 7.30 గంటలకు తాము నివాసముంటున్న గుడిసెలోనే ఈశ్వర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారి సమాచారంతో పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ Residential Plot 4 cents in prime location opp to Kims Savera Hospital for urgent sale west face 30 ft road.Call: 9550064164. [C-820353]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6675]

CHANGE OF NAME

■ I,S.Shahima, W/o.S Athaulla,R/o 13-96,Pavagada Road, Main Road Roddam, Sri Sathya Sai, Andhra Pradesh- 515123. have changed my name and shall here after be Known as S.Shaheena Banu. [UA-52167]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011–25920179. [DA-6239]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9705346587
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

WANTED

■ అనంతపురం జిల్లా గార్లదిన్నెలో ఉన్న ఎడ్యుకేషనల్ సర్వీస్ Office లో టెలికాలర్స్‌గా Work చేయడానికి Females కావలెను. సెల్: 8977502169. [A-3804]

■ వార్డెన్లు & PET కావలెను. అనుభవం మరియు విద్యార్హత కల్గిన వారు సంప్రదించండి. సెల్: 9030292106, 6301824064. [A-22]

■ బజాజ్‌ఎలక్ట్రానిక్ షోరూం ధర్మవరం,అనంతపురంలోపనిచేయుటకు ఆఫీస్‌బాయ్స్,సెక్యూరిటీ గార్డ్స్,హౌస్‌కీపింగ్,ఫీల్డ్‌మేనేజర్ కావలెను.జీతం,PF, ESI,4W/Fకలదు.9989139239, 8179196300. [T-1235627]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [SCA25001741]

■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ఆంధ్ర హోమ్‌కేర్ ఆఫీస్‌కి కావలెను. మంచి జీతం+వ+భో. ✆ 91608 35559, 78158 35561 [B-466]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [HA-1901]

■ Immediate joining for AYYAPPA AGENCIES Banking Collections Dept (AXIS AGRI), required Team Leaders & Collection Executives- Prefer to DRA Certificate Candidates Location: Ananthapur.7569326028/6281439512. [T-789081]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.